ప్రతిపక్షం
www.prathipaksham.in
జూబ్లీహిల్స్ ఎలక్షన్ స్పెషల్
మంగళవారం 04.11.2025
Published From Hyderabad
@prathipaksham
prathipaksham tv telugu



జూబ్లీహిల్స్‌లో విజయం మాదే!

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు



- పదేండ్లు ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యారు
- ప్రజా పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట
- నవీన్ యాదవ్ గెలుపును ఎవ్వరూ ఆపలేరు
- కావాలని విపక్షాలు మాపై దుష్ప్రచారం చేస్తున్నాయి
- 90 శాతం మైనారిటీల మద్దతు కాంగ్రెస్ కే ఉంది
- 'ప్రతిపక్షం'తో కార్మిక మంత్రి డా. వివేక్ వెంకటస్వామి

(ప్రతిపక్షం ప్రత్యేక ప్రతిధులు)

మంచిర్యాల, హైదరాబాద్, నవంబర్ 3: రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం తమదే అని కార్మిక మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రచారంలో ప్రజలు చూపుతున్న ఆదరణతోనే ఆ విషయం అర్థమవుతోందని పేర్కొన్నారు. ఆయన సోమవారం నాడు 'ప్రతిపక్షం' ప్రత్యేక ప్రతినిధులతో మాట్లాడారు. గెలుపు తమదేనని బీఆర్ఎస్ పార్టీ ప్రగల్భాలు పలుకుతోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ రౌడీలకు టిక్కెట్టు కేటాయించారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వివరాలు ఆయన మాటలలోనే..

బీఆర్ఎస్ ఆరోపణల మీద మీ సమాధానం?

* జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మా పార్టీ అభ్యర్థిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 'ఎగుర లేక పందిరి కురుస' అన్న చందంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. గత పదిహేనేండ్లుగా మా పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. పేదలకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నారు. ఆపదలో ఉన్న వారు 'అన్న అంటే నేను ఉన్న' అని ముందున్నారు. రౌడిషీటర్లనే దుష్ప్రచారానికి ప్రజలే ఆ పార్టీకి 'కర్రు కాల్చి వాత' పెడతారు. మా అభ్యర్థి విజయం ఎప్పుడో ఖాయమై పోయింది.

మైనార్టీల ఓట్ల కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి!

గత కొన్నేండ్లుగా పార్టీ అభివృద్ధితో పాటు ప్రజలకు అజారుద్దీన్ నిస్వార్థంగా సేవలు అందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి మంత్రి పదవి ఇచ్చారు. ఎన్నికల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది అబద్ధం. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటే. తప్పుడు ప్రచారంతోనే ఓట్లను దండుకోవాలని చూస్తున్నారు. ప్రజలు దీనిని నమ్మే పరిస్థితిలో లేరు. వారు అన్నీ అర్థం చేసుకుంటారు.

షేక్‌పేట ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది? మైనార్టీలు ఏమంటున్నారు?

షేక్‌పేట ఇన్చార్జిగా గత కొద్ది రోజులుగా ప్రచారం చేస్తున్నాను. కూడళ్లలో సభలు పెట్టి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తున్నాం. ఇంటింటా తిరుగుతూ మా అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నాం. గత ప్రభుత్వంలో మైనార్టీలు అభ్యున్నతికి నోచుకోలేదని చెబుతున్నారు. వారి సమస్యలను రాసుకుంటున్నాం. అభ్యర్థి గెలిచిన వెంటనే ఆ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. జూబ్లీహిల్స్‌లో 4 లక్షల 80 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1 లక్షకు పైగా మైనారిటీలు ఉన్నారు. అందులో దాదాపు 90 శాతం ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే తమ ఓటని చెబుతున్నారు. మైనార్టీలు చూపుతున్న ప్రేమ, ఆదరణ మరిచిపోలేని అనుభూతిని ఇస్తోంది.

ప్రభుత్వ పని తీరుకు ఎన్నికలు నిదర్శనమని ప్రతిపక్షాలు అంటున్నాయి?

ఈ ఎన్నికలో సానుభూతి కోసం ఒకరు తమపై తప్పుడు ప్రచారం చేస్తూ ఓట్లు దండుకోవాలని, ప్రచారంలో ఓటర్లను నమ్మించేందుకు మరొకరు ఎత్తులు వేస్తున్నారు. బీఆర్ ఎస్, బీజేపీ ఒకటే అని ప్రజలకు తెలుసు. బీఆర్ ఎస్ పదేండ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి శూన్యమని ప్రజలే చెబుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ గ్లోబల్ ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోవడం లేదు. మా అభ్యర్థి నవీన్ యాదవ్‌ను కుటుంబ సభ్యుడిలా చూస్తున్నారు. నవీన్‌యాదవ్ గెలుపు అభివృద్ధికి తోడ్పడుతుందని విశ్వసిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఓటర్లలో తమ పార్టీ బలంగా ఉన్నందునే నమ్మలేని దుష్ప్రచారం చేస్తున్నారు. ఆరునూరైనా జూబ్లీహిల్స్‌లో మా పార్టీ జెండా ఎగురవేస్తున్నాం.

మంత్రులు ఎన్నికల ప్రచారానికి పరిమితమని అంటున్నారు. ఆ తరువాత జుబ్లీహిల్స్‌ను పట్టించుకుంటారా?

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికే మేము పరిమితం కాదు. సమయం దొరికినప్పుడల్లా ఇక్కడి అబివృద్ధికి తోడ్పడుతా. ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తా. జూబ్లీహిల్స్ ప్రజలను తమ కుటుంబంగానే భావిస్తున్నాను. ఫోన్ చేస్తే రాత్రి పగలు అనకుండా సాయం చేస్తా. నవీన్‌యాదవ్ ను వెంటబెట్టుకొని డివిజన్లలో పర్యటిస్తా. రాజధానిలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.